

కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలు

కామారెడ్డి టౌన్, మార్చి 19: జిల్లా వ్యాప్తంగా మంగళవారం పదో తరగతి పరీక్షలు 62 సెంటర్లలో ప్రశాంతంగా కొనసాగాయి. రెండో రోజు హిందీ సబ్జెక్ట్ కొనసాగగా మొత్తం 11,962 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 11,940 మంది విద్యార్థులు హాజరైనట్లు డీఈవో రాజు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు. అదేవిధంగా నేడు పరీక్ష లేదని ఇంగ్లీష్ పరీక్ష గురువారం రోజు ఉంటుందని తెలిపారు. కావున విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.



మద్నూర్‌లోని సలాబత్‌పూర్ వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు ఏర్పాటు

జిల్లాపై.. నజర్



- అమలులోకి వచ్చిన లోక్‌సభ ఎన్నికల కోడ్
- సరిహద్దులో చెక్‌పోస్టుల ఏర్పాటు
- జిల్లా వ్యాప్తంగా ఐదు చెక్‌పోస్టులు
- మద్యం, నగదు తరలింపుపై ప్రత్యేక దృష్టి
- ఎన్నికల నేపథ్యంలో విస్తృత తనిఖీలు
- పోలీసు, అధికారులతో ప్రత్యేక బృందాలు
- రూ.50వేలకు మించితే నగదు సీజ్
- ఇప్పటికే కేంద్ర బలగాలు జిల్లాకు రాక

కామారెడ్డి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే జిల్లా అధికారులు పక్కాగా కోడ్ అమలు దిశగా అడుగులు వేస్తున్నారు. ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించడానికి కసరత్తు చేస్తున్నారు. ఈ క్రమంలోనే డబ్బు పంపిణీ, మద్యం రవాణాను అరికట్టడానికి జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా అంతర్రాష్ట్ర జిల్లా సరిహద్దుల్లో ఐదు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయనున్నట్లు పోలీసుశాఖ ప్రకటించింది. పోలీసులు, అధికారులతో సంయుక్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వారికి చెక్‌పోస్టుల వద్ద, గ్రామాల్లో తనిఖీ బాధ్యతలను అప్పగించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన మరుసటి రోజు నుంచే ఈ చెక్‌పోస్టుల నిర్వహణ కొనసాగుతుంది. ఎక్కడికక్కడ బృందాలు తనిఖీ చేస్తున్నాయి.

సరిహద్దులో కీలకం

జిల్లాలోని తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో మహారాష్ట్ర, కర్ణాటక ఆనుకొని ఉంది. పక్కనే మహారాష్ట్రలోని దెగ్లూర్ జిల్లా ఉంది. జిల్లా నుంచి మహారాష్ట్రకు వెళ్లేందుకు జాతీయ రహదారి ఉంది. ఎన్నికల నేపథ్యంలో ఇటీవల మద్నూర్ మండలం సలాబత్‌పూర్ వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టును జిల్లా అదనపు కలెక్టర్ పరిశీలించారు. పోలీసు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. అక్రమ రవాణాకు ఆస్కారం ఉన్న మార్గాలను గుర్తించి ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అదేవిధంగా జుక్కల్ మండలం నుంచి కర్ణాటకకు రహదారులు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లోనూ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ప్రారంభించారు. ఇతర సమయాల్లోనే ఈ రెండు రాష్ట్రాల నుంచి దేశీదారు మద్యం అక్రమంగా జిల్లాకు తరలిస్తుంటారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం రవాణాపై మరింత దృష్టి సారించనున్నారు. అదేవిధంగా పెద్ద మొత్తంలో నగదును తరలించే అవకాశం ఉన్నందున వాటిపై మరింత నిఘా పెట్టనున్నారు. అంతర్రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతీ వాహనాన్ని చెక్‌పోస్టు అధికారులు తనిఖీ చేయనున్నారు. అదేవిధంగా అంతర్ జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులను సైతం ఏర్పాటు చేయనున్నారు. సదాశివనగర్, మాచారెడ్డి, భిక్కనూర్, నాగిరెడ్డిపేట, బాన్సువాడ ప్రాంతాల్లోనూ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీ నిర్వహించనున్నారు.

విస్తృతంగా తనిఖీలు

చెక్‌పోస్టుల వద్ద ప్రస్తుతం పోలీసులు విధులు నిర్వహిస్తున్నా త్వరలో పోలీసుశాఖతో పాటు రెవెన్యూ, ఎగ్జిక్యూటివ్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టనున్నారు. సంబంధిత వ్యవహారాలను చిత్రీకరించడానికి ఒక కెమెరా మెన్‌ను నియమిస్తారు. వాహనాలు, ప్రయాణికుల రాకపోకలపై నిఘా ఉంచడంతో పాటు అక్రమమార్గంలో నగదు, మద్యం తరలించకుండా చర్యలు తీసుకుంటారు. ధ్రువీకరణ పత్రాలు లేకుండా రూ.50వేలకు మించి నగదు తరలించిన విలువైన వస్తువులు ఉన్న జిల్లా కేంద్రానికి తరలిస్తారు. నగదు, ఆయా వస్తువుల వివరాలను నిబంధనల ప్రకారం అధికారులకు సమర్పిస్తే తిరిగి పొందేందుకు వీలు ఉంటుంది. రాజకీయ పార్టీలు, సాధారణ ప్రజలు నిబంధనలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఏ స్థాయి వారైనా చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

ఇబ్బందులు తప్పవా?

జిల్లా పరిస్థితుల నేపథ్యంలో నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకే కాకుండా హైదరాబాద్, నిజామాబాద్, సిరిసిల్ల, సిద్దిపేట లాంటి జిల్లాలకు రాకపోకలు సాగిస్తారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ సమయంలోనూ వీరు ఇబ్బందులు పడ్డారు. రానున్న రెండు నెలల పాటు వివాహాలు, శుభకార్యాలకు అధికంగా ముహూర్తాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వివాహ సంబంధిత వస్తువుల కొనుగోళ్లకై ఇతర ప్రాంతాలకు వెళ్లే వారికి ఇబ్బందులు తప్పేలాలేవు. జిల్లా వ్యాప్తంగా అదే సమయంలో పంటలు చేతికి రావడం రైతులు ధాన్యాన్ని మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. వచ్చిన డబ్బును నగదు రూపంలో తీసుకెళితే అధికారుల తనిఖీల్లో పట్టుబడితే రైతులకు ఇబ్బందులు తప్పవు. ఈ నేపథ్యంలో రైతులు, వినియోగ దారులు నగదు లావాదేవీలు, చెల్లింపులు బ్యాంకుల ద్వారా నిర్వహించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నగదు వెంట ఉంటే మాత్రం అధికారిక ధ్రువీకరణ తప్పనిసరిగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటు

బార్డర్ చెక్‌పోస్టుతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిస్టికల్ సర్వే లెన్స్ బృందాలు, విలేజ్ సర్వేలెన్స్ బృందాలు సహా మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలను రంగంలోకి దింపనున్నారు. ఇప్పటి వరకైతే మండలానికి ఒక మాడల్ కోడ్ ఆఫ్ పర్యవేక్షక బృందం చొప్పున ఏర్పాటు చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను సిద్ధం చేశారు. పోలీసులతో పాటు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులను ఈ బృందాలలో భాగస్వాములను చేయనున్నారు. రాజకీయ పార్టీల కార్యక్రమాలపై మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి. ఇక అప్పటికప్పుడు వచ్చిన సమాచారం ఆధారంగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు వెనువెంటనే రంగంలోకి దిగేలా సిద్ధం చేశారు. నగదు, వస్తువులు పట్టుబడితే ఆరా తీయడానికి బృందాలు ఉన్నాయి. చెక్‌పోస్టులో ప్రధానంగా స్థానిక పోలీసులకు బదులుగా కేంద్ర బలగాలను మోహరించనున్నారు.



ఎల్లారెడ్డిలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు



కామారెడ్డిలో పోలీసులు పట్టుకున్న మద్యం సీసాలు

క్యాంపునకు 8 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు?

- రెండు వర్గాలుగా చీలిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- కామారెడ్డిలోనే మరో వర్గానికి చెందిన కౌన్సిలర్లు
- గోవాకు ప్రయాణమైన బీఆర్ఎస్ కౌన్సిలర్లు?
- వారం రోజులుగా గోవాలోనే ఉన్న కాంగ్రెస్ కౌన్సిలర్లు
- రసవత్తరంగా కామారెడ్డి బల్దియా రాజకీయం

కామారెడ్డి (ఆంధ్రజ్యోతి)/ కామారెడ్డి టౌన్, మార్చి 19: కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై ఇటీవల కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టిన విషయం తెలిసిందే. అంతేకాకుండా బలపరీక్షకు అధికారులు ముహూర్తం సైతం ఫిక్స్ చేశారు. ఈనెల 30న ప్రస్తుత మున్సిపల్ చైర్‌పర్సన్ బల పరీక్షను ఎదుర్కోవాల్సి ఉంది. ఈ బల పరీక్షకు సంబంధించి నోటీసులను మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు ఆయా కౌన్సిలర్‌లకు అధికారులు అందించారు. ఇదేక్రమంలో కాంగ్రెస్ తమ కౌన్సిలర్‌లను కాపాడుకునే ప్రయత్నంలో గత వారంరోజుల కిందట క్యాంపునకు తరలివెళ్లారు. వారంతా ఇప్పటికే క్యాంపులో ఉన్నారు. ఇదంతా ఇలా ఉండగా బీఆర్ ఎస్‌కు చెందిన 8 మంది కౌన్సిలర్‌లు క్యాంపునకు వెళుతూ మున్సిపల్ చైర్‌పర్సన్‌కు షాక్ ఇచ్చారు. సదరు 8 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు మంగళవారం క్యాంపునకు తరలినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ నేపథ్యంలో కామారెడ్డి బల్దియా రాజకీయం రసవత్తరంగా మారింది. అవిశ్వాసం నెగ్గేందుకు కాంగ్రెస్ వద్ద మెజార్టీ కౌన్సిలర్‌లు ఉండగా ప్రస్తుత మున్సిపల్ చైర్‌పర్సన్ బలపరీక్షను నెగ్గుతారో లేదోనని సర్వత్రా ఆసక్తి నెలకొంటుంది.

రెండుగా చీలిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని గత ఎన్నికల్లో ఆ పార్టీ కైవసం చేసుకుంది. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా నిట్టు జాహ్నవి ఎన్నికయ్యారు. గత సంవత్సరం కిందట బీఆర్ఎస్‌కు మున్సిపల్‌లో మెజార్టీ కౌన్సిలర్‌లు ఉండేవారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ పార్టీ అధికారం కోల్పోవడం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో బీఆర్ఎస్‌కు చెందిన ఒక్కో కౌన్సిలర్‌లు కాంగ్రెస్‌లో చేరుతూ వచ్చారు. దీంతో కాంగ్రెస్ బలం 27కు చేరింది. ఇదేక్ర మంలో ప్రస్తుతం బీఆర్ఎస్‌కు 16 మంది కౌన్సిలర్‌లు ఉన్నారు. ఈ 16 మంది కౌన్సిలర్‌లు సైతం రెండు వర్గాలు గా చీలిపోయారు. ఇందులో ఒక వర్గానికి చెందిన 8 మంది కౌన్సిలర్‌లు రెండ్రోజుల క్రితం ఓ కౌన్సిలర్ ఇంట్లో రహస్యంగా సమావేశం అయ్యారు. సదరు కౌన్సిలర్‌లు కాంగ్రెస్ మద్దతుగా ఉండేందుకు నిర్ణయించుకున్నట్లు సమాచారం. దీంతో 8 మంది కౌన్సిలర్‌లు విహార యాత్రకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు.

గోవాలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు

మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు కాంగ్రెస్ కౌన్సిలర్‌లు అందజేసి విహార యాత్రకు వెళ్లారు. 27 మంది కాంగ్రెస్ కౌన్సిలర్‌లు హైదరాబాద్‌లోని ఓ హోటల్‌కు తరలివెళ్లినట్లు తెలిసింది. వారం రోజులుగా వారంతా అక్కడే ఉన్నారు. ఇదే సమయంలో చైర్‌పర్సన్‌పై బలపరీక్షకు అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే కాంగ్రెస్ అవిశ్వాసం నెగ్గాలంటే మరో ఏడుగురు కౌన్సిలర్‌లు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌కు చెందిన 8 మంది కౌన్సిలర్‌లతో కాంగ్రెస్ ముఖ్యనేతలు సంప్రదింపులు జరిపారు. వారితో సంప్రదింపులు సఫలం కావడంతో 8 మంది కౌన్సిలర్‌లు మద్దతు తెలిపేందుకు సిద్ధమయ్యారు. వారంతా కాంగ్రెస్ కౌన్సిలర్‌లతో కలిసి విహారయాత్రకు వెళ్లేందుకు నిర్ణయిం చుకున్నారు. ఇప్పటికే గోవాలో కాంగ్రెస్ కౌన్సిలర్‌లు క్యాంపులో ఉన్నారు. సదరు 8 మంది కౌన్సిలర్‌లు మంగళవారం గోవాకు ప్రయాణం అయ్యారు. ఈ 8 మంది కౌన్సిలర్‌లు మద్దతు తెలిపితే కాంగ్రెస్‌కు 35 మంది బలం చేకూరనుంది. ఈ నేపథ్యంలో 30న జరిగే బలపరీక్షలో కాంగ్రెస్ నెగ్గే అవకాశాలు ఉన్నట్లు కన్పిస్తున్నాయి.

రబీ ధాన్యాన్ని అప్పగించాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, మార్చి 19: గత రబీకి సంబంధించిన ధాన్యాన్ని బిడ్డర్లకు ఎలాంటి ఇబ్బంది పెట్టకుండా అప్పగించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ రైస్‌మిల్లర్లకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం 2022-23 రబీకి సంబంధించి 1.61 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వేలం వేసి బిడ్డర్లకు కేటాయించిందని అన్నారు. జిల్లాలోని 85 రైస్‌మిల్లర్లకు కేటాయించిన రబీకి సంబంధించిన ధాన్యాన్ని ఎటువంటి సాకులు, ఇబ్బందులు పెట్టకుండా బిడ్డర్లకు అప్పగించాలని కలెక్టర్‌కు సూచించారు. అదేవిధంగా 2023-24 ఖరీఫ్‌కు సంబంధించిన రైస్‌మిల్లర్లకు కేటాయించిన 4.40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్‌మిల్లు సామర్థ్యం మేరకు ప్రతిరోజూ మరాడించి ప్రభుత్వానికి అప్పగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు మల్లికార్జున్‌బాబు, నిత్యానందం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో సైబర్‌క్రైం, మనీ మేనేజ్‌మెంట్ అంశాలకు సంబంధించి నిర్వహించిన వ్యాసరచన పోటీలు, చిత్రలేఖనం నినాదాలు రాయడం వంటి అంశాలలో ఉత్తమ ప్రతిభకనబరిచిన అడ్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని రక్షిత, 8వ తరగతి విద్యార్థిని శృతిక మొదటి స్థానాలను పొందారు. మంగళవారం కలెక్టర్‌కు వారికి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో లీడ్‌బ్యాంక్ మేనేజర్ సుధీర్ భార్గవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి

జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు నియమించిన అధికారులు, బృందాలు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ సింధూ శర్మలు తెలిపారు. మంగళవారం ఆర్డీవోలు, డీఎస్పీలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో జూమ్ కాల్‌లో మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రతీ ఒక్కరికి ప్రవర్తన నియమావళి అమలుపై వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేసి అవగాహన కలిగించాలన్నారు. ఎన్నికల ఉల్లంఘనకు పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉల్లంగించవద్దని అన్నారు. పోలింగ్ మే 13న పూర్తి ఎండాకాలంలో ఉండనున్నందున ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నీడను ఏర్పాటు చేయాలని, పోలింగ్ బూతులలో సరైన వెలుతురు, మంచినీరు, టాయిలెట్స్, ర్యాంప్, వీల్‌ఛైర్ తప్ప నిసరిగా ఉండేలా చూడాలని అన్నారు. తహసీల్దార్లు ముందస్తుగా ప్రతీ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం ఎన్నికల సంఘం కల్పించిందని, ఓటు వినియోగం కోసం ఫారం-12 ద్వారా అవకాశం కల్పించాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని రెండు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ఎక్సైజ్, వాణిజ్య, అటవీ, పోలీసుశాఖల సమన్వయంతో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయా లన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసి డబ్బు, మద్యం కానుకల వంటి తరలింపులను గుర్తించి స్వాధీన పరుచుకోవడంతో పాటు కేసులు నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

బుధవారం	గురువారం
ఇఫ్తార్	సహర్
సా.6.33	ఉ.4.58



తమ సంపదను దైవమార్గంలో ఖర్చు చేసేవారు, కోపాన్ని దిగమింగేవారు, ఇతరుల తప్పుల్ని క్షమించే వారంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టం

ఇక అమ్మ ఆదర్శ కమిటీలు

- ఎస్‌హెచ్‌జీ సభ్యులతో ఏర్పాటుకు చర్యలు
- పదో తరగతి వరకు విద్యార్థుల తల్లులకు అవకాశం
- ముగిసిన ఎస్ఎంసీ కమిటీల పద్ధతి
- పాఠశాల పునఃప్రారంభం వరకు మౌలిక వసతుల కల్పనకు చర్యలు

కామారెడ్డి టౌన్, మార్చి 19: పాఠశాలల నిర్వహణ బాధ్యతలను మహిళ కమిటీలకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందుకోసం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేయడానికి విద్యాశాఖాధికారులు చర్యలు చేపట్టారు. విద్య, పాఠశాల నిర్వహణ, గ్రామస్థాయి అభివృద్ధి, పాఠశాలల్లో స్వయం సహాయక బృందాల భాగస్వామ్యం, నాణ్యమైన ఫలితాల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పన, పర్యవేక్షణ వంటి బాధ్యతలను వారికి అప్పగించేందుకు నిర్ణయించింది. ఈ కమిటీ పాఠశాల యూనిఫామ్, మధ్యాహ్న భోజనం, పారిశుధ్య పనుల కోసం వినియోగించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. జూన్ 10 నాటికి ప్రభుత్వ బడుల్లో సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం అధికారు లకు ఆదేశించడంతో ఈ కమిటీలు ఏర్పాటు చేసి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోనున్నారు.

కమిటీ ఏర్పాటు ఇలా..

పాఠశాల స్థాయిలో ఎస్‌హెచ్‌జీ సభ్యుల నుంచి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేస్తారు. గ్రామ సంస్థ లేదా ఏరియా స్థాయి సమాఖ్య అధ్యక్షురాలు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు చైర్‌పర్సన్‌గా ఉంటారు. పాఠశాల హెచ్ఎంలు మెంబర్ కన్వీనర్‌గా ఉంటూ కమిటీల ద్వారానే చేపట్టే కార్యక్రమాలను సమన్వయం చేస్తారు. కమిటీల్లో భాగం కావడానికి తల్లులు లేదా మహిళ సంరక్షకులు ఎస్‌హెచ్‌జీ సభ్యులై ఉండాలి. ఇందులో 1 నుంచి 10వ తరగతి వరకు ముగ్గురు తల్లులు చైర్‌పర్సన్, మెంబర్ కన్వీనర్లను సంయుక్తంగా నామినేట్ చేయబడతారు. కమిటీ సభ్యుల పదవికాలం 2 సంవత్సరాలు లేదా సభ్యుని పిల్లలు పాఠశాల నుంచి నిష్క్రమించిన తేదీ వరకు ఉంటారు.

ముగియనున్న ఎస్ఎంసీ కమిటీల పద్ధతి

పాఠశాల నిర్వహణకు సంబంధించిన బాధ్యతలు గతంలో ఎస్ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఆధ్వర్యంలో నడిపించేవారు. అందులో ఆ పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులతో ఒక చైర్మన్‌ను ఎన్నుకుని పాఠశాలకు కావాల్సిన అవసరాలను ఖర్చు పెట్టేవారు. రెండేళ్ల క్రితమే ఎస్ఎంసీల కాలం ముగిసినప్పటికీ పదవికాలం పొడగిస్తూ వచ్చింది. ఇటీవల ఎస్ఎంసీ కమిటీలకు సంబంధించి ఏర్పాటుకు చర్యలు తీసుకున్న ఆ తర్వాత ఆ నిర్ణయంపై ప్రభుత్వం వెనక్కి తగ్గింది. తాజాగా ప్రభుత్వం ఆ కమిటీల స్థానంలో అమ్మ ఆదర్శ కమిటీల ఏర్పాటుకు సిద్ధపడడంతో ఇక ఎస్ఎంసీ కమిటీలు రద్దు అయినట్లేనని తెలుస్తోంది. అయితే గతంలో ఎస్ఎంసీ కమిటీలు ఉన్న వాటిని నామ మాత్రం చేసి పాఠశాల నిర్వహణలో కొందరు ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించే వారని ప్రభుత్వం గుర్తించినట్లు సమాచారం. ప్రస్తుతం ఆ పాఠశాలకు సమీపంలో ఉన్న ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లోని సభ్యులను వేయడంతో పర్యవేక్షణ ఎక్కువవుతుందని ఆలోచన ప్రభుత్వం చేసిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని సందర్శించిన ట్రైనీ ఫారెస్టు బీట్ అధికారులు



ట్రైనీ బీట్ అధికారులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

డొంకేశ్వర్, మార్చి 19: మండలంలోని చిన్న యానం గాదేపల్లి ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ ప్రాంతాన్ని దూలపల్లి ఫారెస్టు అకాడమీ హైదరాబాదు, ట్రైనీ ఫారెస్ట్ బీట్ అధికారులు మంగళవారం సందర్శించారు. శిక్షణలో భాగంగా బ్యాక్‌వాటర్ ప్రాంతాన్ని పరిశీలించారు. బ్యాక్ వాటర్ నందు వన్య ప్రాణుల చట్టాలపై ట్రైనీ ఫారెస్ట్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. జిం కలు, పక్షులు తిరిగే ప్రాంతాల్లో పర్యటించారు. శిక్షణలో అకాడమీ డైరెక్టర్ రామకృష్ణ, ఆర్మూర్ ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుధాకర్ ఉన్నారు.

'కమ్మ కార్పొరేషన్‌తో పేద కుటుంబాలకు న్యాయం'



మాట్లాడుతున్న కమ్మ ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్

డిచ్‌పల్లి, మార్చి19: సామాజిక న్యాయం కోసం రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి కమ్మ కార్పొరేషన్‌తో పాటు మరో15 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం హర్షనీయమని, కమ్మ కార్పొరేషన్ ద్వారా ఎందరో పేదకుటుంబాలకు న్యాయం జరుగుతోందని రాష్ట్రకమ్మ ఐక్య వేదిక కన్వీనర్ రిటైర్డ్ ప్రొఫెసర్ గోపాలం విద్యాసాగర్‌రావు అన్నారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం ధర్మా రం(బి) గ్రామంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినంద నీయమని కమ్మకులస్థుల తరుపున ఆయన సీఎంకు ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు. గడిచిన 100 రోజుల కాలంలో తెలంగాణలో ఇచ్చిన హామీలు, ఆరుగ్యారెంటీలు అమలు చేసిన ఘతన సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందని, గడిచిన శాసనసభ ఎన్నికల్లో కమ్మ సామాజిక వర్గమంత కాంగ్రెస్‌కే మద్దతు తెలిపిందని అన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నో అక్రమాలు, అవినీతి జరిగిందని, స్వలాభం స్కాంల ప్రభుత్వంగా కేసీఆర్ పేరు గడిచిందన్నారు. రేవంత్‌రెడ్డి సహకారంతో రాజకీయాల్లో కూడా కమ్మ సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పించాలని ఆయన కోరారు. గడిచిన 100రోజుల కాలంలో 5లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంచడం, మహిళలకు ఉచిత బస్సు, 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షల సహాయం కార్యక్రమాలను అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో కమ్మ సంఘం ప్రతినిధులు నాయుడు ఆంజనేయులు, రామకృష్ణ, నాగేశ్వరరావు, పున్నరావు పాల్గొన్నారు.

'పార్టీ కోసం అంకితభావంతో పనిచేయాలి'

సిరికొండ మార్చి 19: పార్టీ కోసం కష్టపడి అంకిత భావంతో పనిచేయడం వల్ల పదవులు వాటంతటా అవే వస్తాయని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్ అన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీరించిన తర్వాత మొట్టమొదటి సారిగా స్వగ్రామానికి వచ్చిన తాహెర్‌బిన్‌హందాన్‌కు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు తన ఇంటి వద్ద జరిగిన సమావేశంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను భీమ్‌గల్ తాలుకా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా రాజకీయ జీవితం ప్రారంభించి అంచెలంచెలుగా పీసీసీ ఉపాధ్యక్షుడి స్థాయికి ఎదిగినట్లు చెప్పారు. జడ్పీకోఆప్షన్ సభ్యుడిగా, జడ్పీటీసీ సభ్యుడిగా, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడిగా, ఇన్‌చార్జీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించినట్లు వివరించారు. కాంగ్రెస్ పార్టీ కోసం ప్రతీ కార్యకర్త అంకిత భావంతో, క్రమశిక్షణతో పనిచేయడం వల్ల పార్టీ ఖచ్చితంగా గుర్తించి పదవులు కట్టబెడుతుందన్నారు. సిరికొండ మండలానాకి సాగునీటి అందించడానికి జిల్లాకు పెద్దన్నగా వ్యవహరిస్తున్న మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని తాహెర్‌బిన్‌హందాన్ అన్నారు. ప్రతీ ఏడాది వడగండ్లు, లేదా అధిక వర్షం వల్ల పంటలు దెబ్బతిని రైతులు ఆర్థింగా నష్టపోతున్నారని, నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవి,పీఏసీఎస్ అధ్యక్షుడు చెల్లెం గంగాధర్, జిల్లా,మండల నాయకులు ఎర్రన్న,బాల్‌రాజ్‌నాయక్, భూషన్‌రెడ్డి,ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి బాల్‌నర్సయ్య,నర్సింగ్,చందర్,రమేష్,మల్లేష్,డీలర్ రమేష్,శ్రీధర్, జగన్,రాజరెడ్డి, దేగాం సాయన్న, భగవాన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిబన్నాజీ,రాజేశ్వర్‌గౌడ్,సంతోష్‌రెడ్డి, లింబాద్రి, బాలయ్య రాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నందిపేట, మార్చి19: మండలంలోని షాపూర్ గ్రామంలో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను జిల్లా పశుసంవర్ధక శాఖ సహయ సంచాలకులు డాక్టర్ బాలిక్ అహ్మద్ ఇచ్చారు. గ్రామంలోని సుమారు 295పశువులకు టీకాలు చేస్తూ రైతులకు గాలికుంటు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గాలికుంటు వ్యాధి నివారణ సహాయ సంచాలకులు డాక్టర్ అశోక్, మండల పశువైద్యాధికారి డాక్టర్ హన్మంత్‌రెడ్డి, పశువైద్యసిబ్బంది, రైతులు తధితరులు ఉన్నారు.

జక్రాన్‌పల్లి: కేశ్‌పల్లిలో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసినట్లు పశువైద్యాధికారిణి డాక్టర్ శిరీష తెలిపారు.ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

జక్రాన్‌పల్లి, మార్చి19: మండలంలోని పడకల్ గ్రామ శివారులో అక్రమంగా మనోహరాబాద్ నుంచి తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సీహెచ్.తిరుపతి మంగళవారం తెలిపారు. అదే గ్రామంలో ఇసుక డంప్‌ను గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దేవాదాయశాఖ కమిషనర్‌ను కలిసిన జిల్లా అధికారులు


దేవాదాయ శాఖ కమీషనర్‌ను కలిసిన జిల్లా ఉద్యోగులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 19: కొత్తగా దేవాదాయ శాఖ కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన హన్మంత్‌రావును జిల్లా ఆ శాఖ అధికారులు మంగళవారం కలిశారు.జిల్లా సహాయ కమీషనర్ సుప్రియ ఆధ్వర్యంలో ఉద్యోగులు కమిషనర్‌కు జిల్లాకు సంబంధించిన విషయాలను వివరించారు.ఉమ్మడి జిల్లా పరిధిలో దేవాలయాలు, భూములకు సంబంధించిన విషయాలను వివరించినట్లు తెలిపారు.

మోర్తాడ్‌లో క్యాన్సర్ ఉచిత హెల్త్ క్యాంప్



మాట్లాడుతున్న అఖిల భారత ప్రగతిశీల రైతు కూలీ సంఘం నాయకులు

మోర్తాడ్, మార్చి19: మోర్తాడ్‌లో ఉచిత క్యాన్సర్ హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ప్రజలు క్యాన్సర్ రోగ నివారణకై ప్రజలు క్యాంప్‌ను సద్వినియోగపర్చుకోవాలని అఖిల భారత ప్రగతిశీల రైతు కూలీ సంఘం నాయకులు సారా సురేష్, జి.కిషన్ అన్నారు. మంగళవారం మోర్తాడ్‌లో వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ఈనెల 21న ఉదయం 9గంటలకు ఉచిత క్యాంప్ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. వారు మాట్లాడుతూ మాన దేశంలో ప్రధానంగా ప్రజలలో పీడిస్తున్న ఆరోగ్య సమస్యలలో ముఖ్యమైనవి క్యాన్సర్ అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్‌పై సరైన అవగాహన లేక అనేక పేద, మధ్య తరగతి ప్రజలు తమ ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ఈ క్యాంప్‌లో క్యాన్సర్ వ్యాధి కాకుండా రొమ్ముక్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ నిర్వహిస్తున్నామని, ఇతర శరీర పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.ఈ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'వందశాతం పన్నులు వసూలు చేయాలి'


సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో సాయిబాబా

రెంజల్,మార్చి19: గ్రామాల్లోని పన్నుల వసూళ్లలలో వందశాతం పురోగతి సాధించి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని డీఎల్‌పీవో సాయిబాబా అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోని ఇంటి పన్ను వసూళ్లను వందశాతం పూర్తి చేయాలని సూచించారు. గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, పారిశుధ్య పనులను చేపట్టాలని నర్సరీలను సంరక్షించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లదేనని, మొక్కలకు ఎప్పటికప్పుడు నీరు పోసి వాటిని సంరక్షించాలన్నారు. ప్రతీ ఒక్కరు విధులు నిర్వహించి అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్, ఎంపీవో గౌస్, పంచాయతీ కార్యదర్శులు రాఘవేంద్ర గౌడ్, రాజేందర్, సాయిలు, రాజు, శ్రీకాంత్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.


ఇంటి పన్ను నివేధికను అందిస్తున్న కార్యదర్శి సంధ్యారాణి

మోస్రా: మండల కేంద్రంతో పాటు గోవూర్, చింతకుంట, తిమ్మాపూర్ గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు మంగళవారం గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ గ్రామాల్లో పన్నులు వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కృష్ణ కుమార్, ప్రేమ్ కుమార్, భూమేష్, ముజీబ్, కారోబార్‌లు శ్రావణ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండలంలోని నాగేంద్రనగర్ గ్రామంలో ఇంటి పన్నులు వంద శాతం పూర్తి చేశారు. అట్టి నివేదికను మంగళవారం ఎంపీవో శివచరణకు కార్యదర్శి సంధ్యారాణి అందజేశారు. వంద శాతం పన్నులు వసూలు చేసినందుకు ఎంపీవో శివచరణ్ కార్యదర్శి సంధ్యారాణితో పాటు సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జీపి సిబ్బంది కారోబార్లు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో సాగు సమస్యలకే వీడియో కాన్ఫరెన్స్

ముప్కాల్, మార్చి19: క్షేత్రస్థాయిలోసాగు సమస్యలన్నీ శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాలు పొందేందుకే వీడియో కాన్ఫరెన్స్ విధానం ఉపయోగంగా పడుతోందని ఏడీఏ మల్లయ్య అన్నారు. మంగళవారం ముప్కాల్ రైతు వేదికలో నిర్వహించిన రైతులతో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో రైతులతో వీడియో కాన్ఫరెన్స విధానం ద్వారా రైతు వేదికల నుంచి రైతులతో వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల నేరుగా మాట్లాడి రైతు నేస్తం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల వివిధ యాజమాన్య పద్ధతులపై డాక్టర్ శ్రీనివాస్, ప్లాంట్ బ్లీడింగ్ శాస్త్రవేత్త రైతులకు వివరించారు. అనంతరం రైతులు అడిగిన సందేహాలను తీర్చారు. అయిల్‌పాం సాగులో తీసుకోవాల్సిన మేళకువలపై డాక్టర్ రాజశేఖర్ డీన్ ఆఫ్ హర్టికల్చర్ వివరించారు. అనంతరం రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. వేసవిలో వివిధ కూరగాయ పంటల్లో పురుగు మందుల వివరాలపై డాక్టర్ కె.కవిత, ప్రిన్సిపాల్ సైంటిస్ట్ ఎంటమాలజీ వివరించి తదుపరి రైతుల యొక్క సందేహాలను నివృత్తి చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా క్షేత్రస్థాయిలో సాగు సమస్యలని శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాలు పొందేందుకు ఉపయోగంగా ఉన్నాయని రైతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు రాజ్‌కుమార్; మహేంధర్‌రెడ్డి, మాలిక్, లావణ్య, ఏఈవోలు నిషికాంత్, అరుణ, రైతులు పాల్గొన్నారు.


ముప్కాల్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు

కమ్మర్‌పల్లిలో పోషణ పక్వాడ పక్షం పక్షోత్సవాలు


మాట్లాడుతున్న ఏసీడీపీవో జ్ఞానేశ్వరి

కమ్మర్‌పల్లి ,మార్చి 19: కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పోషణ పక్వాడ పక్షం పక్షోత్సవాల కార్యక్రమాన్ని రైతువేదికలో నిర్వహించారు.కార్యక్రమానికి హాజరైన ఐసీడీఎస్ ఏసీడీపీవో జ్ఞానేశ్వరి మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి చిరుధాన్యాలు, ఆకుకూరలు, పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.అనంతరం నిర్వహించే కార్యక్రమాలు వాటికి సంబంధించిన ఫొటోలను ఆప్‌లోడ్ చేయడం పట్ల అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పిస్తూ తగు శిక్షణనిచ్చారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ పోషన అభియాన్ రాంబాబు అంగన్‌వాడీ టీచర్లు ఏఎన్‌ఎంలు, తల్లులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పోషణ పక్షం పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏసీడీపీవో జ్యోతి మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాలు కలిగిన ఆహారాన్ని అందజేయాలని సిరిధాన్యాలతో పాటు ఆకుల కూరలను తరచుగా తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడి టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షురాలు ఎ.తార, సరిత, స్వర్ణలత, సునంద, స్రవంతి, వహిదాబేగం, లింగమణి, తదితరులు పాల్గొన్నారు.

గుత్ప, కొత్తపల్లి గ్రామాల్లోని బెల్ట్‌షాప్‌లపై దాడి

● రూ.41వేల 770 విలువ గల మద్యం స్వాధీనం


గుత్పలో బెల్ట్‌షాప్ మద్యం స్వాధీనం చేసుకున్న దృశ్యం

మాక్లూర్, మార్చి19: మాక్లూర్ మండలంలో కొత్తపల్లి, గుత్ప గ్రామాల్లోని బెల్ట్‌షాప్‌లపై సీపీ ఆదేశానుసారం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి బెల్ట్‌షాపుల్లో రూ.30వేల200 విలువ గల మద్యం, గుత్పలో రూ.11వేల 570 మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ దాడుల్లో సీఐ అంజయ్య, సిబ్బంది లక్ష్మణ్, సుదర్శన్, రాములు, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

● బెల్టు షాప్‌పై దాడి

రెంజల్: మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు సోమవారం రాత్రి బెల్టు షాపుపై దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎస్ఐ సాయన్న తెలిపారు. మద్యం విలువ 3,175రూపాయల ఉంటుందని, మద్యం విక్రయిస్తున్నా గాండ్ల కృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

స్పర్శలేని మచ్చలు ఉంటే వైద్యుల్ని సంప్రదించాలి

డొంకేశ్వర్, మార్చి19: శరీరంపై స్పర్శలేని మచ్చలు ఉంటే ఆందోళన చెందకుండా వైద్యులను సంప్రదించాలని డొంకేశ్వర్ హెల్త్ సూపర్ వైజర్ సురేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని నడ్కుడ, గాదేపల్లి ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న కుష్టు వ్యాధి సర్వేను ఆయన పరిశీలించారు. కుష్టువ్యాధి గ్రాస్తులను గుర్తించేందుకు వైద్యసిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటికి వెళ్లి శరీరంపై తెలుపు, గోధుమ రంగులో మచ్చలు ఉన్న వారిని వివరాలు సేకరించారు. ఈ సర్వే ఈనెల 11వ తేదీ నుంచి ప్రారంభమై 24వ తేదీ వరకు కొనసాగుతోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే హెచ్పీ అమూల్య, ఎఎన్‌ఎం రజిని, ఆశాలు రాజమణి, శిరీష, పాల్గొన్నారు.


డొంకేశ్వర్‌లో ఇంటింటి సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

బీపీఎడ్ 1,3వ సెమిస్టర్ 26నుంచి ప్రారంభం

డిచ్‌పల్లి, మార్చి 19: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీపీఎడ్ 1,3వ సెమిస్టర్ రెగ్యూలర్ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 26నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణాధికారి ప్రొ.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణయూనివర్సిటీ వెబ్‌సైట్ సంప్రదించాలని సూచించారు.

రాంసాగర్ తండాలో ఒకరి ఆత్మహత్య

ఇందల్వాయి, మార్చి 19: ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని సిర్నాపల్లి గ్రామ పరిధిలోగల రాంసాగర్ తండాలో లాలూ (43) దివ్యాంగుడు వ్యక్తి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. మృతునికి ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఇద్దరు కూతుళ్ల పెళ్లి చేశారని కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. కూతుళ్ల పెళ్లి కోసం అప్పులు చేయడంతో అప్పుల బాధ ఎక్కువ కావడం వల్ల లాలూ ఆత్మ హత్య చేసుకున్నాడని అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసు లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలి పారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ముప్కాల్, మార్చి19: ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన గద్దల సంతోష్ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబాన్ని, ఇటీవల చేపల వేటకు వెళ్లి మరణించిన అనికేష్ రమేష్ కుటుంబాన్ని మంగళవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

రుద్రూర్‌లో విఠలేశ్వర స్వామి వార్షికోత్స వేడుకలు

రుద్రూరు, మార్చి 19 : రుద్రూరు మండలకేంద్రంలోని శ్రీ విఠలేశ్వర స్వామి ప్రథమ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు రామశర్మ ఆధ్వర్యంలో మొదటి రోజు కుంకుమార్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ వార్షిక వేడుకల్లో భాగంగా సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే భగవద్గీత ప్రవచనాలు ఉంటాయని ఆలయనిర్వాహకులు తెలిపారు. ఈనెల 20న కూడా కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, 21న చివరి రోజు హోమం, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు ఆలయ నిర్వహకులు తెలిపారు.

కాంగ్రెస్‌లోకి పలువురి చేరిక


కాంగ్రెస్ ఆర్మూర్ కౌన్సిలర్‌లు, బీఆర్ఎస్ నాయకులు

ఆర్మూర్‌రూరల్, మార్చి19: ఆర్మూర్ మండలానికి చెందిన నలుగురు మాజీసర్పంచ్‌లు, పలువురు కౌన్సిలర్‌లు మంగళవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాజామాజీ సర్పంచ్‌లు రాజేశ్వర్, మోహన్, సుద్దపల్లి నర్సయ్య, సవిత గణేష్, కౌన్సిలర్‌లు, మాజీకౌన్సిలర్‌లు, బీఆర్ఎస్ నాయకులు, సంజయ్‌సింగ్‌బబ్లు, సడాక్ వినోద్, సంతోష్, జో.శ్రీనివాస్, మాజీసర్పంచ్ కొంగి సదాశివ్, కాటి హన్మండ్లు, కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి వారికి కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి, నిజాంసాగర్ ప్రాజెక్టు మాజీచైర్మన్ యాల్ల సాయిరెడ్డి, మారుతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నామినేషన్ల దాఖలు

ఆర్మూర్‌టౌన్ , మార్చి 19: పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో పలువురు నామినేషన్‌లను దాఖలు చేశారు. ఈనెల 28వ తేదీన బార్ అసోసియేషన్ ఎన్నికలు ఉండడంతో అధ్యక్ష పదవికి చిల్క సుబాష్, సంయుక్త కార్యదర్శి మద్దుల గంగారాం నామినేషన్‌లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారులు గడిడి ఆనంద్, తాళ్ల శ్రీనివాసులు తెలిపారు. ఈకార్యక్రమంలో కృష్ణ పండిత్, ఎంకె.నరేంధర్, చిన్నారెడ్డి, కృష్ణంరాజు, జక్కుల శ్రీధర్, వెంకటేశ్వర్, జగన్, విజయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

జంగంపల్లిలో మల్లు స్వరాజ్యం వర్ధంతి

భిక్కనూరు, మార్చి 19: మండలంలోని జంగంపల్లి గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మల్లు స్వరాజ్యం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లుస్వరాజ్యం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు మాట్లాడుతూ భూమి కోసం జరిగిన భూ పోరాటంలో స్వయంగా పాల్గొన్న మల్లుస్వరాజ్యంను స్ఫూర్తిగా తీసుకుని ఆమె ఆశయసాధన కోసం కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలయ్య, నర్సింలు, రమణ, శ్యామల, సత్యవ్వ, రేణుక, బాలమణి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో అడ్మిషన్లు షురూ

తాడ్వాయి, మార్చి 19: మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ లక్ష్మీబాయి తెలిపారు. ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీకై దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు గురుకుల పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు.



మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులో పేరుకుపోయిన మట్టి

వాటర్ ట్యాంకులో పేరుకుపోయిన మట్టి

ఎల్లారెడ్డి, మార్చి 19: మండలంలోని కళ్యాణి గ్రామంలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులలో గ్రామస్థులు పరిశీలించగా ట్యాంకులలో మట్టి బురద, చెత్త పేరుకుపోయింది. సంబంధిత అధికారులు ట్యాంకుల శుభ్రత గురించి పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపించారు. ఈ ట్యాంకు ద్వారా నీటి సరఫరా చేయడం వల్ల రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేయడంలో అధికారులు విఫలమవుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకుని ట్యాంకులు శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎల్లారెడ్డిలో వాహనాల తనిఖీ

ఎల్లారెడ్డి, మార్చి 19: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మంగళవారం ఎల్లారెడ్డి ఎస్ఐ బొజ్జ మహేష్ ఎల్లారెడ్డి - నిజాంసాగర్ ప్రధాన రహదారిపై వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాహనదారులు రూ.50వేలకు మించి నగదు డబ్బును తీసుకెళ్లరాదని ఆయన అన్నారు. ఆయనతో పాటు ఏఎస్సై సిద్దికి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన

ఎల్లారెడ్డి, మార్చి 19: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో గండి మాసానిపేట్‌లో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆంజనేయ స్వామి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉదయం నుంచి అభిషేకాలు, పూజలు, హోమం, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుజాత కుటుంబ సభ్యులు, ప్రజలు, నాయకులు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నరేష్ పీకే, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు శంకర్, భజరంగ్‌దళ్ నాయకులు తులసీదాస్, భరత్, విశ్వహిందూ పరిషత్ నాయకులు వినోద్, గ్రామపెద్దలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



పోచారం చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసు సిబ్బంది

జిల్లా సరిహద్దులో పోలీసు చెక్‌పోస్టు ఏర్పాటు

నాగిరెడ్డిపేట, మార్చి 19 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా కామారెడ్డి-మెదక్ జిల్లాల సరిహద్దు ప్రాంతమైన పోచారం గ్రామం వద్ద మంగళవారం పోలీసులు ప్రత్యేక చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. జిల్లాలోని వచ్చి పోయే ప్రతి వాహనాన్ని పోలీసులుతనిఖీలు నిర్వహిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా వాహనాలలో డబ్బులు తరలించే అవకాశం ఉండటంతో జిల్లాసరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. చెక్ పోస్టుల వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేశాకే పంపిస్తున్నారు. రాత్రింబవళ్లు ఈ చెక్ పోస్టులు పని చేయనున్నాయి. పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యే వరకు ఈ చెక్ పోస్టులు కొనసాగుతాయని పోలీసు అధికారులు తెలిపారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న పది పరీక్షలు

బాన్సువాడ టౌన్, మార్చి 19: పదవ తరగతి పరీక్షలు బాన్సువాడ పట్టణంలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. రెండవ పరీక్ష రోజున మంగళవారం 1095 మంది విద్యార్థులకు గాను 1092 మంది పరీక్ష రాయగా ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాధికారి నాగేశ్వరరావు తెలిపారు. పరీక్షల సందర్భంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

సామాజిక తనిఖీల్లో బయటపడ్డ అక్రమాలు

బీర్కూర్, మార్చి 19: ఉపాధిహామీ పథకంలో భాగంగా బీర్కూర్ మండలంలో చేపట్టిన పనుల్లో అనేక అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీల్లో బయటపడ్డాయి. మంగళవారం బీర్కూర్ మండల కేంద్రంలో 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి వరకు సంవత్సర కాలంలో బీర్కూర్ మండలంలో 2కోట్ల 31లక్షల 31వేల 926 రూపాయల ఉపాధిహామీ పనులు చేపట్టారు. అయితే సోషల్ ఆడిట్ బృందం సభ్యులు ఐదు రోజుల పాటు గ్రామాల్లో తిరిగి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో అనేక అక్రమాలు, పొరపాట్లు జరిగినట్లు గుర్తించారు. మల్లాపూర్‌లో ఒక వ్యక్తి తన కుటుంబంలో ఆరుగురు సభ్యులు పని చేయకున్నా చేసినట్లు రికార్డు చేయించి 90 వేలు కాజేసినట్లు ఆడిట్ బృందం వారు గుర్తించారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటకున్నా నాటినట్లు రికార్డుల్లో చూపారు. మొక్కలకు నీరు సరఫరా చేసినట్లు రికార్డు చేశారు. వేలాది రూపాయల డబ్బులు దోచేసినట్లు గుర్తించారు. పనులు చేయకున్నా చేసినట్లు రికార్డుల్లో చూపారు. కూలి డబ్బులు చెల్లించారు. పని చేసిన వారికి కూలీ డబ్బులు చెల్లించినట్లు గుర్తించారు. కొన్ని గ్రామాల్లో బినామీ పేర్లతో, ఫోర్జరీ సంతకాలతో డబ్బులు కాజేశారు. కిష్టాపూర్ గ్రామంలో కొంత మంది నాయకులు పని చేయకుండానే, పనులు చేసినట్లు సుమారు 10 వేలు లేపేశారు. ఈ అక్రమాలపై అదనపు పీడీ వామన్‌రావు ఏపీవో, టీఏలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డుల్లో ఎంపీడీవో సంతకాలు చేయకపోవడంపై నిలదీశారు. తిమ్మాపూర్‌లో గ్రామ పంచాయతీ వర్కర్ల పేరుపై కూలీ డబ్బులు చెల్లించినట్లు గుర్తించారు. ఈ మేరకు సదరు అధికారికి 4,140 రూపాయల జరిమానా వేశారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని, డబ్బులు రికవరీ చేస్తామని ఏపీడీ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు పీడీ వామన్‌రావు, విజిలెన్స్ అధికారులు దత్తాత్రి, ప్రశాంత్, స్టేట్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నరేందర్, ఎస్ఆర్‌పీ కొమురయ్య, ఎంపీడీవో భారతి, సూపరింటెండెంట్ భానుప్రకాష్, డీఆర్‌పీలు, జీపీ కార్యదర్శులు, సోషల్ ఆడిట్ బృందం తదితరులు పాల్గొన్నారు.



బీర్కూర్ ప్రజా వేదికలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏపీడీ

పోషక లోపం లేని చిన్నారులను తయారు చేయడమే లక్ష్యం

పెద్ద కొడప్‌గల్, మార్చి 19: మండలంలో పోషకలోపం లేని చిన్నారులను తయారు చేయడమే ఐసీడీఎస్ లక్ష్యం అని మద్నూర్ ఐసీడీఎస్ సీడీపీవో సునంద అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషక అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోషకపక్షం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఏ ఇంట్లో కూడా పోషకాహార లోపంతో ఉన్న పిల్లలు లేకుండా చేయడమే తమ శాఖ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందుకు గాను తమ శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలు పోషకాహారంతో కూడిన ఆహారాన్ని తీసుకునేలా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు చిరు ధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నసీమా, పోషక అభియాన్ ప్రాజెక్ట్ బ్లాక్ కో ఆర్డినేటర్ బాలక్రిష్ణ, మండల అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలు విజయమ్మ, ఆయా గ్రామాల కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



మహిళలకు సామూహిక సీమంతాలు చేస్తున్న దృశ్యం

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



పుష్కరిణిలో శ్రీవారికి చక్రస్నానం చేయిస్తున్న ఎమ్మెల్యే పోచారం

బీర్కూర్, మార్చి 19: బీర్కూర్ శివారు, తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో ఈనెల 14న ప్రారంభమైన శ్రీవారి నవమ బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిసాయి. ఉదయం 7 గంటలనుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శాంతి పాఠం, ద్వార తోరణ పూజ, ధ్వజ కుంభారాధన, నిత్య హవనం, ఉదయం 9.30 గంటలకు మహా పూర్ణాహుతి, బలిహరణం, 10 గంటలకు స్నపన తిరుమంజనం, శ్రీవారి పుష్కరిణిలో శ్రీవారికి పుష్కరిణిలో శ్రీవారికి చక్ర స్నానం చేయించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ మాడ వీధుల్లో కల్ప వృక్ష వాహనంపై శ్రీవారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం 6 గంటలనుంచి 9 గంటల వరకు శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. శ్రీ దేవతో ద్వాసనం, శ్రీ పుష్పయాగం, ద్వాదశారధనం, సప్తావరణం,. ధ్వజరోహనం, కుంభ ప్రోక్షణం, శాత్తు ముర్రై, మహాద్వాశీ రచనం, ఆచార్య రుత్విక్‌సన్మానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రివేళలో మాడ వీధుల్లో శ్రీవారు అశ్వ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శంభురెడ్డి, కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల వద్ద మున్సిపల్ సిబ్బంది వినూత్న నిరసన

కామారెడ్డిటౌన్,మార్చి 19: మున్సిపాలిటీలో ఆస్తిపన్ను చెల్లించని మొండి బకాయిదారుల దుకాణాల వద్ద మంగళవారం మున్సిపల్ సిబ్బంది వినూత్ననిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ రవి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ కమిషనర్ సుజాత ఆదేశాల మే రకు ఇప్పటికే సంవత్సరాల తరబడి ఆస్తిపన్ను బకాయిలు ఉన్న పలువురికి రెడ్‌నోటీసులు సైతం జారీచేశామని అయిన ఎలాంటి స్పందన లేకపోవడంతో దుకాణాల వద్దే కూర్చొని నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం 90శాతం వడ్డీరాయితీ ప్రకటించిన నిర్లక్ష్యం వీడకపోవడం తగదని అన్నారు. ఇప్పటివరకు 6 కోట్ల 3లక్షల 11 వేలు వసూలు కాగా ఇంకా 2 కోట్ల 80లక్షల 12వేల డ్యూ ఉందని తెలిపారు. మున్సిపల్ సిబ్బంది చేపడుతున్న వినూత్న నిరసనతో పలువురు మొండి బకాయిదారులు ఆస్తిపన్నును చెల్లించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ జానయ్య, బిల్ కలెక్టర్‌లు సాయిలు, రాజు పాల్గొన్నారు.



దుకాణాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఉపాధి పనులను తనిఖీ చేసిన డీఆర్‌డీవో



పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో

రాజంపేట, మార్చి 19: మండలంలోని కొండాపూర్ గ్రామపంచాయతీలో మంగళవారం ఉపాధి హామీ జరుగుతున్న పర్మిషన్‌రోడ్డు పనిని ఆకస్మికంగా డీఆర్‌డీవో చందర్‌నాయక్ తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలతో మాట్లాడి అక్కడ జరుగుతున్న పనుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోజువారి కూలీ రూ.272 వచ్చేవిధంగా పనిచేయాల్సిందిగా కూలీలకు తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో 100 మంది ఉపాధి కూలీలు వచ్చే విధంగా ప్రణాళిక ప్రకారం పనులను చేయాల్సిందిగా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులు పరిశీలించి అవకతవకలు లేకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశం, ఎంపీవో రఘురాం తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, విద్యుత్ దీపాల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలి

సదాశివనగర్, మార్చి 19: మండలంలోని అన్ని గ్రామాలలో వీధి దీపాలు, తాగునీరు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ తెలిపారు. మంగళవారం సదాశివనగర్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పనితీరు గత సమావేశాలలో సభ్యులు లేవనెత్తిన అంశాలపై పరిష్కరించిన విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నందున పంచాయతీ కార్యదర్శులు గ్రామంలోని సమస్యలను ఎప్పటికప్పుడు వారి దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు నిత్యం అందించే సౌకర్యాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గైని అనసూయ, జడ్పీటీసీ నర్సింలు, తహసీల్దార్ గంగాసాగర్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోహినోద్దిన్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మండల ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కామారెడ్డి టౌన్, మార్చి 19: రాష్ట్రస్థాయిలో ఓహెచ్‌ఎస్ సాయి ఇన్ అసోసియేషన్ విత్ ఇండియన్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై నిర్వహించిన ఆన్‌లైన్ క్విజ్‌లో కామారెడ్డి జిల్లాకు చెందిన ఆర్కిడ్స్ పాఠశాలలో 9 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు జిల్లా రవాణాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆ పాఠశాల విద్యార్థులను అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ ప్రతిభ సాధించిన 200 మంది విద్యార్థులల్లో 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. వీరిలో అక్షయ్, షహాన్, అభిలాష్, సాయి మనీష్, నిత్యశ్రీ, భవిత, మోక్ష, వర్షిత, శశాంక్‌లు ఉన్నారని తెలిపారు. విద్యార్థులు రోడ్డుపై వెళ్లేటప్పుడు హెల్మెట్‌ను తప్పకుండా ధరించాలని, అలాగే డ్రైవింగ్ లైసెన్స్‌ను ఖచ్చితంగా కలిగి ఉండాలని, ట్రాఫిక్ రూల్స్ తప్పకుండా పాటించాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందించిన జిల్లా రవాణాధికారి శ్రీనివాస్‌రెడ్డి

సకాలంలో ఇంటి పన్ను చెల్లించాలి

నసురుల్లాబాద్, మార్చి 19: మండల కేంద్రంలో మండల పరిషత్ అధికారి ఎంపీవో రాము మంగళవారం గ్రామంలో ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను సకాలంలో చెల్లించాలని ప్రజలకు వివరించారు. ప్రజలు ఇంటి పన్నులు చెల్లిస్తే గ్రామ అభివృద్ధి చేయగలుగుతామని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఇంటిపన్నులు చెల్లించాలని గ్రామస్తులకు ఎంపీవో రాము సూచించారు. ఈకార్యక్రమంలో గ్రామకార్యదర్శి రాజేష్ కుమార్, కారోబారి రతన్‌కుమార్ పాల్గొన్నారు.

4న నాగిరెడ్డిపేట వైస్ ఎంపీపీపై అవిశ్వాస బలపరీక్ష

నాగిరెడ్డిపేట, మార్చి 19: మండల ప్రజాపరిషత్ వైస్ ఎంపీపీ దివిటి రాజ్‌దాస్‌పై ఏప్రిల్ 4వ తేదీన అవిశ్వాస బల పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ తెలిపారు. గత సంవత్సరం 2023 జూలై 7న నాగిరెడ్డిపేట మండలంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎనిమిది మంది ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీ రాజ్‌దాస్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అప్పట్లో వైస్ ఎంపీపీ రాజ్‌దాస్ తనపై ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు స్టే ఇవ్వడంతో బలపరీక్ష నిరూపణ ప్రక్రియ నిలిచిపోయింది. ఇటీవల హైకోర్టు స్టే ఎత్తివేయడంతో నాగిరెడ్డి పేటవైస్ ఎంపీపీ రాజ్‌దాస్‌పై అవిశ్వాస బలపరీక్ష కోసం ఏప్రిల్ 4వ తేదిన నాగిరెడ్డిపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు మండలంలోని 9 మంది ఎంపీటీసీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో తెలిపారు.

సొసైటీ చైర్మన్ రాజీనామా

నసురుల్లాబాద్, మార్చి 19: మండలంలోని మైలారం గ్రామానికి చెందిన సొసైటీ చైర్మన్ పెర్క శ్రీనివాస్ సోమవారం తన రాజీనామా చేశారు. డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టే ఆలోచనలో ఉండటంతో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరతారా లేదా బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతారా అన్న వార్తలు మండలంలో చర్చనీయాంశమయ్యాయి.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే సంబరాలు

తాడ్వాయి, మార్చి 19: మండలంలోని కృష్ణాజీవాడి ఉన్నత పాఠశాలలో మంగళవారం దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో రామస్వామి మాట్లాడుతూ దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే ఉత్సవాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో దేశ్‌పాండే ఫౌండేషన్ ప్రతినిధులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉప్పల్‌వాయిలో ఒకరి ఆత్మహత్య

రామారెడ్డి, మార్చి 19: మండలంలోని ఉప్పల్‌వాయి గ్రామానికి చెందిన ఆకుల లింగం(46) అనే వ్యక్తి ఆత్మహత్యచేసుకున్నట్లు ఎస్ఐ కొండవిజయ్ తెలిపారు. గ్రామానికి చెందిన లింగం గత సంవత్సరం బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో నడవలేని స్థితికి చేరుకున్నాడు. సోమవారం రాత్రి తన కుటుంబ సభ్యులతో భోజనం చేసి ఇంట్లో పడుకున్నాడు. తెల్లవారు జామున కుటుంబీకులు చూసేసరికి కేబుల్ వైర్‌తో పశువుల కొట్టంలో ఉరివేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య ఆకుల పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి మృతి

కామారెడ్డిటౌన్, మార్చి 20: పట్టణంలోని హరిజనవాడకు చెందిన బానవత్ మహేష్(40) అనే వ్యక్తి మంగళవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకున్నట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మహేష్ స్వగ్రామం మాచారెడ్డి మండలం సరదాపూర్ తండాకాగా హరిజవాడకు చెందిన గీత అను ఆమెతో సహజీవనం చేస్తు జీవిస్తున్నాడు. అతనికి మద్యం అలవాటు ఉండడంతో లివర్‌ప్రాబ్లం ఏర్పడడం, మూర్ఛవ్యాధి ఉండడంతో జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని కలిసిన యువజన విభాగం నాయకులు

కామారెడ్డి టౌన్, మార్చి 19: హైదరాబాద్‌లో జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను మంగళవారం బీఆర్ఎస్ రాష్ట్రయువ నాయకుడు గంపశశాంక్, కామారెడ్డి నియోజకవర్గ యువజనవిభాగ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గంపశశాంక్ మాట్లాడుతూ రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ గెలుపుకోసం గంపగోవర్ధన్ సారథ్యంలో పనిచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కామారెడ్డి యువజనవిభాగం అధ్యక్షుడు భానుప్రసాద్, నాయకులు రంజిత్, శేఖర్, చాట్ల రజనికాంత్, గడ్డం రవీందర్‌రెడ్డి, నితిశ్‌రెడ్డి, రామమూర్తిగౌడ్, కనకరాజు పాల్గొన్నారు.

కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

పెద్ద కొడప్‌గల్, మార్చి 19: తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించబడిన బాన్సువాడ పట్టణానికి చెందిన కాసుల బాల్‌రాజ్‌ను మంగళవారం జుక్కల్ కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా జుక్కల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అస్పత్‌వార్ వినోద్ మాట్లాడుతూ బాన్సువాడ పట్టణానికి చెందిన కాసుల బాల్‌రాజ్ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌గా నియమించబడటం ఆనందంగా ఉందని తెలిపారు. తమ మున్నూర్ కాపు సామాజిక వర్గానికి చెందిన బాల్‌రాజ్ రానున్న రోజులలో మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

బీబీపేట, మార్చి 19: బీబీపేట మండల కేంద్రంలో హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో దేవాలయ 6వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఉదయం నుంచి కలశపూజ, పంచామృత అభిషేకం, హరిహరాసనం, హోమం నిర్వహించారు. ప్రధాన పూజారి ఉన్నికృష్ణన్ నింబుద్రి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి మనోజ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, బాశెట్టి నాగేశ్వర్, నందకుమార్, విఠల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

- దర్శన్ - రజాకార్
- శాంతి - ప్రేమలు
- ప్రియా 70 - భీమా
- ప్రియా 35 - తంత్ర

బాన్సువాడ

- మహేశ్వరి - భీమా
- వెంకటేశ్వర - రజాకార్

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

